

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 14-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :145 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

పేద మహిళలే టార్గెట్!

అక్రమ అండాల దందాలో కొత్త కోణం

ఒయాసిస్, సద్గురు కేంద్రాలపై క్రిమినల్ కేసులు

గర్ల్స్ హాస్టల్‌పై దాడి.. 12 మంది మహిళలకు విముక్తి

రూ.50 వేల ఆశచూపి మహిళల అక్రమ రవాణా

ప్రమాదకర హార్మోన్ ఇంజెక్షన్లతో అండాల సేకరణ

66 మంది మహిళల నుంచి అండాల సేకరణ

19 మంది రికార్డులు మాయం..

తొమ్మిది మంది ఏజెంట్ల కోసం గాలింపు



2 లో

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లో వెలుగు చూసిన అక్రమ అండాల (సరోగసి/ఐవీఎఫ్) దందా కలకలం రేపుతోంది. నగరంలోని ప్రముఖ ఫెర్టిలిటీ కేంద్రాలైన 'ఒయాసిస్', 'సద్గురు' సెంటర్లపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా సద్గురు హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు దాని డైరెక్టర్ డాక్టర్ గేదెల దుర్గారావు, పలువురు ఏజెంట్లపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ దారుణాల గుట్టు రట్టయింది.

ఈ దందాలో భాగంగా బేగంపేటలోని 'అమి నీతా గర్ల్స్ హాస్టల్'పై పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంయుక్తంగా దాడి చేశారు.

ఏపీలో పల్లెపోరుకు ముహూర్తం!

ఏపీలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది

తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఈ నెల 17 వరకు నామినేషన్ల స్వీకరణ

18న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ

నవంబర్ 26న తొలి విడత పోలింగ్

2 లో

అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణ

భారత్ సమ్మిట్.. విదేశీ కుట్రనా?

భారత్ సమ్మిట్‌పై బండి సంజయ్ ఫైర్

2 లో

దేశ వ్యతిరేకుల కలయిక వేదికంటూ విమర్శ

విదేశీ శక్తులతో కుట్ర చేస్తున్నారంటూ ఆరోపణ

రాహుల్‌కు అంతర్జాతీయ ప్రచారమా అంటూ ప్రశ్న

సమ్మిట్ ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

గత సమ్మిట్‌కు రూ.29.45 కోట్ల ఖర్చుపై నిలదీత

పెట్టుబడులు, ఉద్యోగాలపై లెక్కలు చెప్పాలని సవాల్

నీళ్ల దొంగే కాదు.. బొగ్గు దొంగవా?

హరీశ్‌పై కవిత ఫైర్

ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి?

నిమ్స్ నిధుల్లో రూ.100 కోట్ల స్కామ్

కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత ప్రశ్నలు

సిద్దిపేటలో టీఆర్ఎస్ జెండా లక్ష్యం

హరీశ్‌పై పోరాటం ఆగదంటూ శపథం


2 లో

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): నీళ్ల, నిధుల దొంగే కాకుండా బొగ్గు దొంగ హరీశ్ రావు అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె సిద్దిపేటలో నిర్వహించిన పార్టీ కార్యాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట గడ్డపై టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని, హరీశ్ రావును ప్రజా జీవితం నుంచి తరిమేసే వరకు పోరాటం ఆపేది లేదని ఆమె స్పష్టం చేశారు.

ఆ ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి..

మహారాష్ట్ర నుంచి బొగ్గు తెస్తున్నట్లు చెప్పి సింగరేణి నుంచి బొగ్గు తెప్పించుకుంటూ భారీ అవినీతికి పాల్పడ్డారని కవిత ఆరోపించారు.

హైదరాబాద్‌లో గ్లోబల్ హంగామా!



- హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ మేధోమథనం
- 70కి పైగా దేశాల నుంచి వెయ్యిమందికి పైగా ప్రతినిధులు
- 'ఫోర్జింగ్ ఎ న్యూ వరల్డ్' థీమ్‌తో కీలక చర్చలు
- ప్రజాస్వామ్యం, ప్రపంచ శాంతిపై నేతల గళం
- ప్రియాంక, రాహుల్ గాంధీ ప్రత్యేక ప్రసంగాలు
- ఏఐ నుంచి వాతావరణ మార్పుల వరకు 12 అంశాలు
- తెలంగాణ రైజింగ్.. పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు
- గిగ్ వర్కర్లతో రాహుల్ ప్రత్యేక భేటీ

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): భాగ్యనగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ మేధోమథనానికి వేదికైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' రెండో ఎడిషన్‌కు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ), హైటెక్స్ కేంద్రాలుగా సర్వం సిద్ధమయ్యాయి. 'ఫోర్జింగ్ ఎ న్యూ వరల్డ్' అనే ప్రధాన ఇతివృత్తంతో నవంబర్ 13, 14 తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. భారత స్వాతంత్ర్యం 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతిని పురస్కరించుకుని ఈ అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు.

మిగతాది 2 లో..

గూఢచర్యం ఆరోపణలు.. సీఈవో రాజీనామా!



2 లో

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): ప్రపంచ టెక్ దిగ్గజం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా లో పెను సంచలనం చోటుచేసుకుంది. ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. సీఈవో బాధ్యతలతో పాటు కంపెనీ బోర్డు సభ్యత్వానికి కూడా ఆయన రాజీనామా సమర్పించారు.

ప్రభుత్వ భూములు నీ అయ్య జాగీరా రేవంత్?

భూముల అమ్మకాలపై హరీశ్ ఫైర్

ఎవరిచ్చారు అమ్మే అధికారం?

కూకట్‌పల్లి భూముల వేలం ఆపాలి

రూ.26 వేల కోట్ల భూముల విక్రయం

మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్

వేలం బిడ్డర్లకు హరీశ్ హెచ్చరిక


2 లో

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్టు.. రేవంత్ రెడ్డి భూముల చుట్టే తిరుగుతున్నాడు.. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ప్రజలు ఏమైపోయినా పర్లేదు, భూములు అమ్మడమే తమ పని అన్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కూకట్‌పల్లి మూసాపేట ట్రక్ పార్క్ భూముల్లో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, ఆర్టీఓ ఆఫీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నర్సరీని కూడా అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటు అని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ కూకట్‌పల్లి ట్రక్ పార్క్ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి హరీశ్ రావు పరిశీలించారు.

ప్రశాంతి కుటీరం.. 50 ఏళ్ల స్ఫూర్తిగాథ!



ప్రశాంతి కుటీరం స్వర్ణోత్సవ వేడుకల్లో మోదీ

50 ఏళ్ల ప్రస్థానం అద్భుత స్ఫూర్తిగాథ

ప్రతి భారతీయుడూ తెలుసుకోవాల్సిన సేవా ప్రయాణం

యోగా కేంద్రం నుంచి ప్రపంచ ఉద్యమంగా ఎదుగుదల

సేవ, అంకితభావానికి ప్రశాంతి కుటీరం ప్రతీక

హెచ్‌వీ శేషాద్రి సేవలకు ప్రధాని ప్రశంసలు

శేషాద్రి రచించిన ఆరు పుస్తకాల ఆవిష్కరణ

2 లో

టీచర్ కొలువులకు తొలి అడుగు!



ఈ నెల 16 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

డిసెంబర్ 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

డిసెంబర్ 28 నుంచి హాల్ టికెట్లు

జనవరి 3 నుంచి 15 వరకు పరీక్షలు

ఫిబ్రవరి రెండో వారంలో టెట్ ఫలితాలు

1 నుంచి 8వ తరగతులకు రెండు పేపర్లు

రెండు పేపర్లకు రూ.1,000 ఫీజు నిర్ణయం

2 లో

ఇంటర్‌కు ఇక బైబై!

2027-28 నుంచి కొత్త విద్యావిధానం

హైస్కూళ్లలోనే 11, 12 తరగతులు

ఇంటర్ చట్టం రద్దుకు ఆర్డినెన్స్

స్కూళ్లు, కాలేజీల విలీనానికి కసరత్తు

విలీనానికి న్యాయశాఖ ఆమోదం

ఉద్యోగుల కేడర్‌కు ఢోకా లేదు

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేస్తూ పాఠశాల విద్యలో విలీనం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో కొత్త విద్యా విధానం ఎలా ఉండబోతుందనే చర్చ కొనసాగుతోంది. వచ్చే విద్యా సంవత్సరం(2027-28) నుంచి 12వ తరగతి విద్యావిధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. డ్రాపౌట్లను నివారించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విద్యా విధానంలో ప్రాథమిక, సెకండరీ, 9 నుంచి 12 వరకు సీనియర్ సెకండరీ విద్య అమల్లోకి రానుంది. ఈ విలీనం తర్వాత ఇంటర్ బోర్డు, పాఠశాల విద్యాశాఖలో ఒక ప్రత్యేక విభాగంగా



మారనుంది. ఇందుకోసం స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలో కొత్తగా 'ఇంటర్మీడియట్ వింగ్'ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.ఈ నూతన విధానం ద్వారా వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో ఇంటర్మీడియట్ కోర్సు స్థానంలో 11, 12 తరగతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ తరగతులు పూర్తిగా హైస్కూల్ పరిధిలోకి రానున్నాయి. ఇందుకు వీలుగా 1971 నాటి తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా చట్టాన్ని రద్దు చేస్తూ, 1982 నాటి విద్యా చట్టానికి సవరణలు చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే ఆర్డినెన్స్ తీసుకురానున్నట్లు సమాచారం.

2 లో

పాక్ వలకు చిక్కిన వింగ్ కమాండర్!

నగ్న ఫొటోల కోసం దేశ రహస్యాల లీక్

ఒక్కో ఫొటోకు ఒక్కో వార్ ప్లాన్ పేజీ

పాక్ ఏజెంట్‌తో వాట్సాప్ చాటింగ్

డ్రోన్లు, యుద్ధ విమానాల వివరాల చేరవేత

3 వేలకుపైగా టెక్స్ట్ మెసేజ్‌లు

ఐదుగురు సిబ్బంది ఫోన్లకూ మాల్‌వేర్

జాతీయ భద్రతకు పెను ముప్పు

ఐదు నెలల క్రితమే వింగ్ కమాండర్ అరెస్ట్

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

శనివారం 14-11-2026

పాక్ వలకు చిక్కిన వింగ్ కమాండర్!



న్యూస్ డెస్క్, 12 నవంబర్ (ఇది కద నిజం): పాకిస్తాన్ నిఘా ఏజెంట్‌కు రహస్య యుద్ధ ప్రణాళికలు, సైనిక వివరాలను చేరవేసిన భారత వైమానిక దళ వింగ్ కమాండర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ ప్రకారం.. సదరు అధికారి నగ్న ఫొటోల కోసం అత్యంత సున్నితమైన దేశ రక్షణ రహస్యాలను అవతలి వ్యక్తికి షేర్ చేసినట్లుగా విచారణలో తేలింది.

రహస్యాల బదలాయింపు..

పాకిస్తాన్ ఏజెంట్ పంపిన నగ్న ఫొటోలకు బదులుగా, క్లాసిఫైడ్ వార్ ప్లాన్ పేజీలను ఈ వింగ్ కమాండర్ పంచుకున్నట్లుగా ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ప్రతి నగ్న ఫోటోకు ఒక యుద్ధ ప్లాన్ పేజీని ఇస్తానని ఆయన బేరం కుదుర్చుకున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. యుద్ధ సమయాల్లో డ్రోన్ యూనిట్ల మోహరింపు, వాటి సామర్థ్యాలు, లేహ్‌లో ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల మోహరింపు వివరాలు, సూరత్‌గఢ్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో జరిగిన సైనిక విన్యాసాలకు సంబంధించిన అత్యంత కీలకమైన సమాచారం పాకిస్తాన్‌కు చేరింది.

వాట్సాప్‌తో సంభాషణలు..

ఈ ఏడాది జనవరి 12 నుంచి ఏప్రిల్ 1 మధ్య కాలంలో వారిద్దరి మధ్య వాట్సాప్ వేదికగా భారీగా సంభాషణలు జరిగాయి. వాటిలో 3,008 టెక్స్ట్ మెసేజ్‌లు, 65 ఇమేజ్‌లు, 42 వాయిస్ కాల్స్, 4 వీడియో కాల్స్ ఉన్నట్లుగా గుర్తించారు. పాకిస్తానీ ఏజెంట్ పంపిన మాల్‌వేర్ అప్లికేషన్లను తన కింది స్థాయిలో పనిచేస్తున్న ఐదుగురు సబార్డినేట్ల పరికరాల్లో ఇన్‌స్టాల్ చేయడానికి ఈ అధికారి ప్రయత్నించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీంతో మరిన్ని సున్నితమైన రక్షణ శాఖ డేటా లీకయ్యే ప్రమాదం ఏర్పడింది. అఫీషియల్ సీక్రెట్ యాక్ట్ కింద 5 నెలల క్రితం అరెస్టయిన ఈ వింగ్ కమాండర్‌కు సంబంధించిన విచారణలో జాతీయ భద్రతకు ముప్పు కలిగించే ఈ షాకింగ్ విషయాలు బయటపడ్డాయి.

భూముల వేలంపై భగ్గుమన్న హరీశ్!

మొదటి పేజీ తరువాయి

అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూముల విక్రయించాలన్న నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు:

రేవంత్ రెడ్డి శాశ్వతం కాదని, హైదరాబాద్ మాత్రమే శాశ్వతమని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఉన్న భూములన్నీ అమ్ముకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజా అవసరాలకు భూములు ఎక్కడి నుంచి తెస్తారని ఆయన ప్రశ్నించారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు జాగ్రత్తగా ఉండాలని, 'బిడ్డా.. రేపు మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు ఈ భూముల్లో ఎలాంటి అనుమతులు రావని హరీశ్ రావు' అని హెచ్చరించారు. బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం కలిసి ఎంత పెద్ద ఉద్యమమైనా చేసి ఈ భూమిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

ఎవరి జాగీరని అమ్ముతున్నారు?

ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను ఎవరి జాగీరు అని అమ్ముతున్నారని, అమ్మే అధికారం ఎవరిచ్చారని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్ రావు నిలదీశారు. లక్ష కోట్ల భూముల అమ్మకం: రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల విలువైన భూములను రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇప్పటికే రూ. 26 వేల కోట్ల భూములు అమ్మేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో ల్యాండ్ స్కామ్, సాండ్ స్కామ్, కోల్ స్కామ్‌లతో ఎక్కడ చూసినా కుంభకోణాలే కనిపిస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వారసత్వ భూములు అని మాట్లాడిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి రాగానే వాటిని కూడా అమ్మేస్తున్నారని నీది నోరా మోరా? అంటూ దుయ్యబట్టారు. హెచ్‌సీయూ భూములను తాకట్టు పెట్టి బ్రోకర్ ద్వారా అప్పు తెచ్చుకున్నారని, కేసు గెలిచిన 400 ఎకరాల మియాపూర్ భూమిని కోర్టు కాపీ రాకముందే అమ్మకానికి పెడతామని సీఎం స్వయంగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

మా పోరాటంతో నాటి కాంగ్రెస్ వెనక్కి తగ్గింది:

2013లో కూడా కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూమిని అమ్మడానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని, ఆరోజు కూడా సీపీఐ, సీపీఎం పార్టీలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేసి అడ్డుకుందని హరీశ్ రావు గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇక్కడ పోలీస్ స్టేషన్, నర్సరీ, ఆర్టీఓ కార్యాలయం, ఎమ్మెల్యే కార్యాలయం కోసం భూమి కేటాయించామన్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఆ ప్రభుత్వ కార్యాలయాలను కూడా కలిపి అమ్మేస్తానంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమి కూడా అమ్మమని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు వెతికి మరీ ప్రభుత్వ భూములను వేలం వేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు, కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ప్రభుత్వం వందల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేస్తూ సమ్మిట్ల పేరుతో ప్రచార ఆర్భాటాలు చేస్తోందని హరీశ్ రావు మండిపడ్డారు.

భారత్ సమ్మిట్.. విదేశీ కుట్రనా?



న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్' దేశ వ్యతిరేకుల కలయిక వేదికగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. దేశ అభివృద్ధిని అడ్డుకునేందుకు, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి విదేశీ శక్తులతో కలిసి చేస్తున్న కుట్ర ఇదని ఆయన విమర్శించారు. ఈ సమ్మిట్ నిర్వహణపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ఆయన పలు సూటి ప్రశ్నలు సంధించారు.

విదేశీ శక్తులతో కుట్ర

భారత్ సమ్మిట్‌లో పాల్గొంటున్న 70 దేశాల ప్రతినిధుల్లో మెజారిటీ వ్యక్తులు భారతదేశ విధానాలను వ్యతిరేకిస్తున్న వారేనని బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి పేరుతో విదేశీ శక్తులతో కలిసి ఈ సదస్సు నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. భారతదేశ అంతర్గత రాజకీయ వ్యవహారాలపై విదేశీ ప్రతినిధులతో చర్చించే అధికారం కాంగ్రెస్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో చర్చించే అంశాలు భారత విదేశాంగ విధానానికి అనుగుణంగా ఉన్నాయా అని నిలదీశారు.

ప్రజాధనంతో రాహుల్ గాంధీకి అంతర్జాతీయ ప్రచారమా?

భారత్ సమ్మిట్ అసలు ఉద్దేశం తెలంగాణ ప్రజల సమస్యలు పరిష్కరించడానికా? లేక రాహుల్ గాంధీ రాజకీయ ఆలోచనలకు అంతర్జాతీయ ప్రచారం కల్పించడానికా అని బండి సంజయ్ ప్రశ్నించారు.ఈ సమ్మిట్ నిర్వహణకు మొత్తం ఎంత ఖర్చు చేస్తున్నారు? ప్రభుత్వ ఖజానా నుంచి ఎంత వెచ్చిస్తున్నారు? రాహుల్ గాంధీ రాజకీయ కార్యక్రమానికి తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా ఖర్చు చేస్తారని ఆయన నిలదీశారు.ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో రైతులు కరువుతో ఇబ్బంది పడుతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు డీఏలు, పీఆర్సీ, హెల్త్ కార్డులు లేక గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం వల్ల తెలంగాణకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదన్నారు. తెలంగాణకు కావాల్సింది అంతర్జాతీయ సమావేశాల ప్రచారం కాదని, ఉద్యోగాలు, ఉపాధి, సాగునీరు, రైతులకు భరోసా అనే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని బండి సంజయ్ విమర్శించారు.

గత సమ్మిట్‌పై శ్వేతపత్రం ఇవ్వండి:

గత సమ్మిట్‌లో రూ.29.45 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. ఆ సొమ్ము ఎవరికి చెల్లించారు? గత సమ్మిట్‌లో 44 అంశాలతో చేసిన 'హైదరాబాద్ తీర్మానం'లో ఎన్ని అమలయ్యాయి? దాని ద్వారా తెలంగాణకు ఎన్ని కొత్త పరిశ్రమలు, ఎన్ని కోట్ల పెట్టుబడులు, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెబుతూ శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా అని సవాల్ విసిరారు. తెలంగాణలో ప్రజలు తీవ్ర సమస్యలతో అల్లాడుతుంటే, ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలును పక్కనపెట్టి అంతర్జాతీయ రాజకీయ చర్చలు జరపడం దుర్మార్గమని బండి సంజయ్ మండిపడ్డారు.

టీచర్ కొలువులకు తొలి అడుగు!

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు సంబంధించిన అధికారిక నోటిఫికేషను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా. నవీన్ నికోలస్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరీక్షను పూర్తిగా ఆన్లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరిస్తారు. డిసెంబర్ 28వ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరి 3వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహణ ఉంటుంది. పరీక్షలు ఉదయం 9.00 నుండి 11.30 వరకు, మధ్యాహ్నం 200 నుండి 4.30 వరకు (వ్యధి: 2 గంటల 30 నిమిషాలు) ఉంటాయి. ఫిబ్రవరి రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.

పరీక్షా విధానం & పేపర్లు..

ఈ టెట్ పరీక్ష రెండు పేపర్లుగా నిర్వహించబడుతుంది.

పేపర్-1: 1 నుండి 5వ తరగతి వరకు బోధించాలనుకునే ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం.

పేపర్2: 6 నుండి 8వ తరగతి వరకు బోధించాలనుకునే ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం.

రెండు తరగతుల విభాగానికి బోధించదలచిన వారు రెండు పేపర్లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు రుసుము వివరాలు:

జనరల్, బీసీ అభ్యర్థులకు ఏదైనా ఒక పేపర్‌కు రూ. 750/- కాగా, రెండు పేపర్లకు కలిపి రూ. 1000/- చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల అభ్యర్థులకు ఒక పేపరు రూ.700/- మరియు రెండు పేపర్లకు రూ. 950/- గా నిర్ణయించారు. అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ https://schooledu.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌లోని ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

ఇంటర్‌కు ఇక బైబై!

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ఇంటర్ విద్యాశాఖను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేస్తే కొత్తగా ఏర్పాటయ్యే విభాగానికి తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రతిపాదన చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఇప్పటికే టీపీఎస్‌ల ద్వారా ఒకే ప్రాంగణంలో నర్సరీ నుంచి 12 వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఇంటర్ బోర్డు రద్దు తర్వాత ఒక ప్రాంతంలో పక్కపక్కనే స్కూళ్లు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలుంటే వాటిని కలిపే యోచన ఉంది. అలాగే 2 కి.మీ కంటే దూరంలో కాలేజీలు, స్కూళ్లను కలిపి ఎలా ఒకబోర్డు ద్వారా నిర్వహించాలి అనే అంశాలను పరిశీలిస్తున్నారు.

లీగల్ క్లియరెన్స్..

ఇప్పటికే ఇంటర్ బోర్డు ప్రతిపాదనపై ప్రభుత్వం సుదీర్ఘంగా కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ముసాయిదా ఇప్పటికే సిద్ధం కాగా, విలీన ప్రక్రియకు సంబంధించి చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేందుకు న్యాయశాఖ నుంచి ఆమోదం లభించిన విషయం తెలిసిందే. వచ్చే విద్యా సంవత్సరం నుంచి దాన్ని అమలు చేసేందుకు విభాగాల చట్టాల్లో సవరణలు చేయాల్సి ఉన్నందున పాఠశాల, ఇంటర్ విద్యాశాఖలు సంయుక్తంగా రూపొందించిన ముసాయిదా బిల్లు న్యాయశాఖ పరిశీలనకు పంపగా క్లియరెన్స్ వచ్చింది. ఉద్యోగుల సర్వీస్ నిబంధనలు తదితర అంశాలపై న్యాయపరంగా చిక్కులు రాకుండా ఆ శాఖ పరిశీలించినట్లు తెలుస్తోంది.

ఉద్యోగుల కేడర్, అధికారాలకు ఢోకా లేదు..

ఇంటర్ బోర్డు విలీనం నేపథ్యంలో ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖలో ఇంటర్ ఉద్యోగుల విలీనం ఉండబోదని, ప్రస్తుతం ఇంటర్ విద్య, ఇంటర్ బోర్డులో పనిచేస్తున్న ఉద్యోగుల సీనియారిటీ, విధులు, అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొంటున్నారు. ఎవరి కేడర్ వారిదే ఉంటుందని, ప్రస్తుతం వారికి వర్తిస్తున్న నిబంధనలే భవిష్యత్తులోనూ అమలవుతాయని చెబుతున్నారు. విలీనం తర్వాత పాఠశాల విద్యాశాఖ కేవలం పర్యవేక్షణ బాధ్యతలను మాత్రమే నిర్వర్తించనున్నట్లు తెలుస్తోంది.

గూఢచర్యం ఆరోపణలు.. సీఈవో రాజీనామా!

మొదటి పేజీ తరువాయి

వ్యక్తిగత ప్రవర్తన, వివాహేతర సంబంధాల ఆరోపణలతో పాటు జాతీయ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశాలు తెరపైకి రావడంతోనే ఆయన వైదొలగాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. దశాబ్దాల పాటు ఎన్విడియాను అగ్రస్థానంలో నిలిపిన హువాంగ్.. ఆకస్మికంగా రాజీనామా చేయాల్సి రావడం అంతర్జాతీయ టెక్, కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

జెన్సన్ హువాంగ్‌కు 'మెగా స్పీడ్' డైరెక్టర్ అలిస్ హువాంగ్‌తో వివాహేతర సంబంధం ఉండటం ఈ వివాదానికి ప్రధాన కారణంగా మారాయి. ఈ విషయాన్ని హువాంగే స్వయంగా అంగీకరించడం అందరినీ షాక్ కు గురిచేసింది. అయితే, అలిస్ హువాంగ్‌ను అమెరికా నిఘా వర్గాలు చైనా గూఢచారిగా అనుమానిస్తుండటం ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రతరం చేసింది. ప్రపంచ ఏఐ చిప్ మార్కెట్లో కీలకమైన ఎన్విడియా అధినేతకు, చైనా గూఢచారిగా భావిస్తున్న వ్యక్తితో సంబంధాలు ఉండటం జాతీయ భద్రత, డేటా గోప్యత పరంగా తీవ్ర ఆందోళనలకు దారితీసింది. దీనికి తోడు, ఎన్విడియాలో పనిచేస్తున్న మరో మహిళా ఉద్యోగినితోనూ జెన్సన్‌కు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు రావడం కంపెనీ కోడ్ ఆఫ్ కండక్ట్ కిందకు వచ్చింది.

ఈ పరిణామాల నేపథ్యంలో జెన్సన్ హువాంగ్ రాజీనామాకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. సంస్థ కార్యకలాపాలకు మరియు ఏఐ చిప్ సరఫరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు బోర్డు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఎన్విడియా ప్రస్తుత చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) కొలెట్ క్రెస్‌ను కంపెనీ తాత్కాలిక సీఈవోగా నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. పూర్తి స్థాయి కొత్త సీఈవో ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు కొలెట్ క్రెస్ ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. మరోవైపు, ఈ ఆకస్మిక నాయకత్వ మార్పు మరియు గూఢచర్యం ఆరోపణల ప్రభావం ఎన్విడియా షేర్లు, భవిష్యత్ ప్రణాళికలపై ఏ విధంగా ఉండబోతోందన్న దానిపై ప్రపంచ మార్కెట్ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

నీళ్ల దొంగే కాదు.. బొగ్గు దొంగవా?

మొదటి పేజీ తరువాయి

మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి జరిగిందని, నిమ్స్ ఆస్పత్రి ఈపీఎఫ్ ఫండ్‌లో సుమారు రూ.100 కోట్ల స్కామ్ జరిగిందని ఆమె విమర్శించారు. నిమ్స్ ఉద్యోగులే తనకు ఈ ఆధారాలు పంపించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది అమరులైనా వారి కుటుంబాలను ఆదుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల త్యాగాలను ప్రస్తావిస్తూ.. ఉద్యమ సమయంలో కొందరు నాయకులు ఆస్తులు భారీగా పెంచుకున్నారని, వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భూముల కబ్జాలతో పాటు సిద్దిపేట రిజిస్ట్రేషన్ ఆఫీస్ మార్పు వెనుక కూడా స్వార్థ రాజకీయాలున్నాయని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో తాను ఏనాడూ పైరవీలు చేయలేదని, పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిలో తనకు ఎలాంటి భాగస్వామ్యం లేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై సూటి ప్రశ్నలు..కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు గుప్పించిన కవిత.. మల్లన్న సాగర్, గౌరవెల్లి నిర్వాసితులకు ఇంకా పరిహారం అందలేదని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీ నెరవేరలేదని తెలిపారు. హరీశ్ రావు అవినీతిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాలపై స్పష్టమైన సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

సిద్దిపేటలో ప్రత్యామ్నాయ రాజకీయాలు తాను ఎన్నో మేధావులతో చర్చించి, 50 కమిటీలు వేసి ప్రజల సమస్యలను తెలుసుకున్న తర్వాతే తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించానని కవిత వెల్లడించారు. ప్రైవేట్ రంగంలోనూ పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడమే తమ పార్టీ ప్రధాన సంకల్పమని తెలిపారు. సిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికల నుంచి పోరాటం ప్రారంభించి, ఈ ప్రాంతానికి స్వాతంత్ర్యం తెస్తామని అన్నారు. ప్రజల పక్షాన నిలిచే కొత్త నాయకత్వాన్ని తెస్తామని, ప్రజలు తమకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కల్వకుంట్ల కవిత కోరారు.

ప్రశాంతి కుటీరం.. 50 ఏళ్ల స్ఫూర్తిగాథ!

న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): కర్ణాటకలోని బెంగళూరులో ఉన్న స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన్ (S-VYASA) ప్రధాన కేంద్రం 'ప్రశాంతి కుటీరం' స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్యూ-వ్యాసా (S-VYASA) విశ్వవిద్యాలయం 'గోల్డెన్ జూబ్లీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్'కు ప్రధాని శంకుస్థాపన చేయడంతో పాటు, కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఆఫ్-క్యాంపస్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇదే వేదికపై నిర్వహించిన ఆర్ఎస్ఎస్ మాజీ సర్ కార్యవాహ, ప్రముఖ రచయిత హెచ్.వి. శేషాద్రి శతజయంతి (100వ జయంతి) వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ, ఆయన రచించిన ఆరు పుస్తకాల హిందీ, ఆంగ్ల అనువాదాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణమే లక్ష్యంగా హెచ్.వి. శేషాద్రి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఒక దేశాన్ని విజయశిఖరాలకు చేర్చాలంటే అంకితభావం, సామర్థ్యం, క్రమశిక్షణ కలిగిన పౌరులు అవసరమని గుర్తించి, అలాంటి వ్యక్తులను తీర్చిదిద్దడానికి ఆయన తుదిశ్వాస వరకు కృషి చేశారని ప్రశంసించారు.

'ప్రశాంతి కుటీరం' సేవలపై ప్రశంసలు

కర్ణాటక గొప్ప వారసత్వ సంపద నడుమ 'ప్రశాంతి కుటీరం' సాగించిన 50 ఏళ్ల ప్రయాణం సేవ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు తప్పక తెలుసుకోవాల్సిన అద్భుత గాథ ఇదని అభివర్ణించారు. ఒక చిన్న యోగా కేంద్రంగా మొదలై, నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక మహా ఉద్యమంగా ఎదిగిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రధాని మోడీ అభినందించారు.

ఏపీలో పల్లెపోరుకు ముహూర్తం!



న్యూస్ డెస్క్, 13 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి కొనసాగుతూనే ఉంది.. ఇప్పటికే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముగిసి.. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఎన్నికలకు కూడా జరుగుతుండగా.. మరోవైపు.. పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

తొలి విడత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 18న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఈ నెల 26వ తేదీన తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలను ప్రకటించనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఈ నెల 27వ తేదీన రీపోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఇక, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సిద్ధమవుతున్నారు.

పేద మహిళలే టార్గెట్!

మొదటి పేజీ తరువాయి

ఈ తనిఖీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 మంది మహిళలను అధికారులు సురక్షితంగా రక్షించారు. నిరుపేద మహిళలకు రూ. 50 వేల డబ్బు ఆశచూపి ఇతర రాష్ట్రాల నుంచి వారిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఎలాంటి వైద్య పర్యవేక్షణ, నిబంధనలు పాటించకుండా ఈ ముఠా మహిళలకు ప్రమాదకరమైన హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. అండాల సేకరణ సమయంలో ఒకవేళ 7 కంటే తక్కువ అండాలు వస్తే, ఏజెంట్ కమీషన్‌లో ఏకంగా 50 శాతం కోత పెట్టేవాళ్లని తేలింది. ఎక్కువ డబ్బు సంపాదనే ధ్యేయంగా మహిళల ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా వారికి పరిమితికి మించి హార్మోన్ డోసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేశారు.

ఈ ముఠా ఇప్పటివరకు సుమారు 66 మంది మహిళల నుంచి అండాలను సేకరించగా, అందులో 19 మందికి సంబంధించిన రికార్డులను పూర్తిగా మాయం చేయడం గమనార్హం. అంతేకాకుండా, ఎలాంటి అనుమతులు లేని గచ్చిబౌలి, ఉప్పల్, మలక్‌పేట, టోలీచౌకి ప్రాంతాల్లోని క్లినిక్‌లకు ఈ అండాలను సరఫరా చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంపై దీచీం, ART (అసిస్టెంట్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ) చట్టాల కింద Cr.No 426/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న అమిత్ శర్మ, నిఖత్ శర్మ, దీపిక సహా మొత్తం 9 మంది ఏజెంట్ల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

హైదరాబాద్‌లో గ్లోబల్ హంగామా!

మొదటి పేజీ తరువాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో జరుగుతున్న ఈ సదస్సుకు 70కి పైగా దేశాల నుంచి వెయ్యి మందికి పైగా విధాన రూపకర్తలు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక కార్యకర్తలు తరలివచ్చారు.

గతేడాది తెలంగాణలో నిర్వహించిన తొలి సదస్సు విజయవంతం కావడంతో, దానికి కొనసాగింపుగా ఈ ఏడాది మరింత విస్తృత స్థాయిలో దీనిని ఏర్పాటు చేశారు. బ్రెజిల్, హంగరీ, సెర్బియాలలో ప్రోగ్రెసివ్ పార్టీల విజయాలు, అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత జరుగుతున్న తొలి అంతర్జాతీయ ప్రగతిశీల నేతల సమావేశం ఇదే కావడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న విద్వేషపూరిత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా, ప్రజాస్వామ్య విలువలు, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, శాంతియుత సహజీవనం ప్రాతిపదికన కొత్త ప్రపంచ క్రమాన్ని నిర్మించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. ఆఫ్రో-ఆసియా సంఘీభావం, అలీన ఉద్యమ వారసత్వాన్ని గుర్తుచేస్తూ, గ్లోబల్ సౌత్-గ్లోబల్ నార్త్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంపై ఇందులో కీలక చర్చలు జరగనున్నాయి.

ఈ మూడు రోజుల సదస్సులో రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం, క

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

శనివారం 14-11-2026

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి



ఇది కద నిజం, యాదాద్రి :యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామి వారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

యాదగిరిగుట్టపై గుండు మల్లయ్య ఓవరాక్షన్

- సిబ్బందిని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు!
- వీఐపీ లిఫ్ట్ వద్ద దురుసు ప్రవర్తన
- విధుల్లో ఉన్న ఆలయ అధికారులపై అసభ్య పదజాలంతో తీవ్ర దూషణలు
- లిఫ్ట్ ఆపరేటర్, సూపరింటెండెంట్లను ఏకవచనంతో సంబోధిస్తూ హంగామా
- సిబ్బందిని కించపరచడంపై అధికారుల భగ్గు
- మల్లయ్య తీరును తీవ్రంగా ఖండిస్తూ దేవస్థానం ఉద్యోగుల నిరసన గళం
- అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



ఇది కద నిజం, యాదగిరిగుట్ట :కార్తీక మాసం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గుండు మల్లయ్య గుప్త ఆలయ అధికారులు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారు. స్వామి వారి దర్శనం అనంతరం వీఐపీ లిఫ్ట్ ద్వారా కిందికి దిగే క్రమంలో ఆయన ఆలయ అధికారులపై అసభ్య పదజాలంతో దూషణలకు దిగినట్లు తెలుస్తోంది. "లిఫ్ట్ ఆపరేటర్ ఎవడు, సూపరింటెండెంట్ ఎవడు" అంటూ సిబ్బందిని ఏకవచనంతో సంబోధించడంపై ఆలయ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుతమైన ట్రస్ట్ బోర్డు సభ్యుడి హోదాలో ఉండి ఆలయ సిబ్బంది పట్ల ఇలా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అధికారులు, ఉద్యోగులు తప్పుబడుతున్నారు. ట్రస్ట్ సభ్యుడి తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపిన ఆలయ అధికారులు, గుండు మల్లయ్య వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని సిబ్బందికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్తీక మాసం సందర్భంగా భక్తులకు విస్తృత ఏర్పాట్లు



ఇది కద నిజం,యాదగిరిగుట్ట: కార్తీక మాసం పవిత్ర సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు నిర్వహించుకునేందుకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. కార్తీక మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, వ్రత మండపం వద్ద భక్తులు వేచి ఉండేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా రెండు హాళ్ల ముందు పెద్ద పరిమాణంలో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాద విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఎండ తీవ్రత వల్ల భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కార్తీక మాసం పూర్తయ్యే వరకు ప్రతిరోజూ భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, ప్రసాద విక్రయాలు తదితర అన్ని సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అదనపు ఏర్పాట్లు చేపట్టేందుకు దేవస్థానం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలకు విచ్చేసే ప్రతి భక్తునికి సౌకర్యవంతమైన, ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే దేవస్థానం ప్రధాన లక్ష్యమని విజ్ఞప్తి చేస్తుంది.

ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన చేయాలి

బండ్రు శోభారాణికి అఖిలపక్ష కమిటీ వినతి



ఇది కద నిజం :ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి తక్షణమే అధికారిక ప్రకటన విడుదల చేయించాలని కోరుతూ శుక్రవారం ఆలేరు పట్టణంలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాయకురాలు బండ్రు శోభారాణికి ఆమె నివాసం వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆలేరు ప్రాంత సమగ్ర అభివృద్ధి జరగాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఒక్కటే మార్గమని, ఇందుకోసం గత పదేళ్లుగా కమిటీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారని, ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఇదే విషయాన్ని ప్రకటించారని కమిటీ సభ్యులు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు అధికారిక ప్రకటన రాకపోవడం శోచనీయమని, ప్రభుత్వం కాలయాపన చేస్తోందని వారు పేర్కొన్నారు. స్థానికురాలైన బండ్రు శోభారాణి ప్రత్యేక చొరవ తీసుకుని ఆలేరు రెవెన్యూ డివిజన్ ప్రకటన వెలువడేలా కృషి చేయాలని అఖిలపక్ష కమిటీ సభ్యులు కోరారు. దీనిపై శోభారాణి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే అఖిలపక్ష కమిటీ సభ్యులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరు వీరేశం, కో-కన్వీనర్ రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, మొరిగాడి శేఖర్, నంద గంగేష్, వడ్డెమాను నరేందర్, తుంగ కుమార్, కామెడీకారి అశోక్, దయ్యాల సంపత్, పేరపు రాములు, ఎండి సలీం, ఆంజనేయులు, బెజాడి కుమార్, పద్మ, సుదర్శన్, కళ్లెపు అడవయ్య, ఎలుగల కుమారస్వామి, మంచన మల్లేశం, గుండు మధు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ఇది కద నిజం :యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్ల పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. సమాజంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద కుటుంబాలకు ఆసరా పెన్షన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రతి నెలా అందే పెన్షన్‌తో వారి నిత్యావసర అవసరాలకు ఆర్థిక తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు బాధ్యతగా పనిచేస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు.

ఆలేరు అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

మాజీ విప్ గొంగిడి సునీత



ఇది కద నిజం :యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయకుండా వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని ఆమె పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, టీఎస్ ఐపాస్ వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంలోనూ, మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ విఫలమైందని ఆమె ఆరోపించారు. అనవసర విమర్శలు మానుకుని ఆలేరు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు గొంగిడి సునీత హితవు పలికారు. ఆలేరు, యాదగిరిగుట్ట అండర్ పాస్ పనులను పూర్తి చేయకపోవడం, 100 రోజుల్లో ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తామన్న హామీని నెరవేర్చకపోవడంపై ఆమె ప్రశ్నించారు. గత మూడేళ్ల కాలంలో ఆలేరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేర్లు మార్చే ఆలోచనలు పక్కనపెట్టి, ఎండిపోతున్న చెరువులకు గోదావరి జలాలను తరలించి రైతులకు సాగునీరు అందించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

ఓయూ హాస్టల్లకు నీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట విద్యార్థుల మహాధర్నా





ఇది కద నిజం, హైదరాబాద్ :ఉస్మానియా యూనివర్సిటీలోని ఈ1, ఈ 2, డి హాస్టళ్లకు తక్షణమే విద్యుత్, నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. లా కాలేజీకి సంబంధించిన ఈ హాస్టళ్లను కూల్చివేసే ఉద్దేశంతోనే అధికారులు కరెంట్, వాటర్ సప్లై నిలిపివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించే కుట్ర చేస్తున్నారని విద్యార్థి నేతలు మండిపడ్డారు. ఇప్పటికే ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, తప్పుడు ఆరోపణలతో హాస్టళ్లను మూసివేయాలని చూడటం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓయూకు రూ.1,000 కోట్ల నిధులు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తక్షణమే హాస్టళ్లకు నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించి మెస్‌లను తెరవాలని, అలాగే టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులతో పాటు ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న విద్యార్థి నేతలను అడ్డుకున్నారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యతో పాటు నరేష్, నాగరాజు బోయపల్లి, భీమారావు, సురేష్, కార్తీక్, హరీష్, ప్రసాద్, వంశీ, సతీష్, అశోక్, ప్రదీప్, రమేష్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పేద ప్రజల మనిషి గోదా యాదగిరి ఆశయాల సాధనకై కలిసి పోరాడాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు



ఇది కద నిజం :యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద అమరజీవి కామ్రేడ్ గోదా యాదగిరి 27వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ బబ్బూరి నాగయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా, మరో సీనియర్ నాయకులు కామ్రేడ్ పేరబోయిన పెంటయ్య గోదా యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ యాదగిరిగుట్టలో సీపీఐ పార్టీ నిర్మాణ బాధ్యుడిగా, పేద ప్రజల మనిషిగా గోదా యాదగిరి తన జీవితాంతం ప్రజా సంక్షేమం, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ఆదర్శ నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకై కార్యకర్తలందరూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇండ్లు లేని పేద ప్రజల కోసం భూపోరాటాలు నిర్వహించి, 350 మందికి 220 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను పంపిణీ చేయించడంతో పాటు పాత గుట్ట రోడ్డులో 13 గుంటల చొప్పున భూమిని పంపిణీ చేయడంలో గోదా యాదగిరి కీలక పాత్ర పోషించారని గోదా శ్రీరాములు గుర్తు చేశారు. మహిళల సమస్యలు, గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారం కోసం మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున ఆయన వద్దకు వచ్చేవారని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ముఖ్యంగా బస్టాండ్, డిపో ఏర్పాటు కావడం ఆయన పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్కెం కృష్ణ, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, పేరబోయిన మహేందర్, కొల్లూరి రాజయ్య, సీపీఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు ఆరే పుష్ప, సంజీవ, మీసాల దాసు, పేరపు రాములు, మరిగూడం సర్పంచ్ స్వప్న జగన్, చిన్న కందుకూర్ ఉప సర్పంచ్ కాటము శ్రీకాంత్, కోకిల రవీందర్, తుమ్మల ఇస్తారీ, చందునాయక్, సత్తిబాబు, గోదా యాదగిరి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుమాస్తా స్థాయి నుండి న్యాయవాదిగా ఎదిగిన మహేందర్ గౌడ్

- వ్యవసాయ కుటుంబం నుండి న్యాయస్థానం వరకు యువతకు అసలైన రోల్ మోడల్!
- తండ్రి లేని లోటు ఆర్థిక ఇబ్బందులు అయినా ఆగని అడుగులు



ఇది కద నిజం, చేవెళ్ల : చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన కరణం మహేందర్ గౌడ్, ఒక సాధారణ గుమాస్తా స్థాయి నుంచి న్యాయవాది స్థాయికి ఎదిగి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వ్యవసాయ నేపథ్యం కలిగిన కరణం వజ్రలింగం, లక్ష్మి దంపతులకు జన్మించిన ఆయనకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, వ్యవసాయ పనుల్లో పాలుపంచుకుంటూనే చదువుపై మక్కువతో జీవితంలో ఏదైనా సాధించాలనే బలమైన తపనతో ఆయన ముందుకు సాగారు. తండ్రి అకాల మరణంతో కుటుంబ బాధ్యతలన్నీ మహేందర్ గౌడ్ భుజాలపై పడ్డాయి. ఒకవైపు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు కుటుంబ పోషణ భారంగా మారినప్పటికీ ఆయన ఏమాత్రం వెనకడుగు వేయలేదు. గుమాస్తాగా వృత్తి బాధ్యతలు నిర్వర్తిస్తూనే, తన న్యాయవిద్యను కొనసాగించారు. ఈ కఠిన ప్రయాణంలో ఆయన తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు అందించిన తోడ్పాటు, ప్రోత్సాహం ఆయనను నిలబెట్టాయి. ఎన్నో కష్టాలు, అవమానాలు, అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొని నేడు అడ్వకేట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించబోతున్న మహేందర్ గౌడ్‌కు గురువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు.

ఈ సందర్భంగా అడ్వకేట్ కరణం మహేందర్ గౌడ్ మాట్లాడుతూ "ఇది ఒక్కరోజులో సాగిన ప్రయాణం కాదు. కష్టాల కడలిలో ఈదుకుంటూ, ఎన్నో అడ్డంకులను దాటుకుంటూ సాధించిన విజయం. నా జీవితంలో ఇదొక మరిచిపోలేని మైలురాయి. ఇది నాకు గర్వకారణం మాత్రమే కాదు, సమాజం పట్ల మరింత బాధ్యతతో ముందుకు సాగేందుకు ఒక ప్రేరణ. చట్టమే నా బలం, న్యాయమే నా లక్ష్యం, నిజాయితీనే నా మార్గంగా భావించి ప్రజలకు న్యాయ సేవలు అందిస్తాను" అని తన మనోగతాన్ని పంచుకున్నారు.

చింతల్ భాగ్యరధి డిగ్రీ కళాశాలలో "నషా ముక్త యువ - నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి - వక్తల పిలుపు



ఇది కద నిజం :చింతల్‌లోని భాగ్యరధి డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నషా ముక్త యువ -- నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్, సామాజిక కార్యకర్త కుమార్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ హాజరయ్యారు. వీరితో పాటు బీజేవైఎం నాయకులు మణి, నషా ముక్త్ భారత్ అభియాన్ వాలంటీర్ రేవంత్, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు, గంజాయికి మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన కేసులు, చట్టంలోని సెక్షన్లు, నేరాలకు విధించే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ సమస్యపై ఎవరైనా నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ మరియు ఇతర అక్రమ కార్యకలాపాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసిందని, ఈ బృందం మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేకంగా పనిచేస్తోందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఎప్పటికీ మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని, తప్పుడు వ్యసనాల కారణంగా బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక విద్యార్థి చెడు అలవాట్లకు బానిసైతే ఆ ప్రభావం కేవలం అతని జీవితంపైనే కాకుండా కుటుంబం మొత్తం మీద పడుతుందని తెలిపారు. తమ పిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని తల్లిదండ్రులు ఎంతో ఆశతో ఎదురుచూస్తుంటారని, అలాంటి తల్లిదండ్రులకు బాధ కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు. సామాజిక కార్యకర్త కుమార్ యాదవ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అయితే ప్రభుత్వాల చర్యలతో పాటు సమాజంలో కూడా ప్రతి ఒక్కరిలో అవగాహన, అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. భారతదేశంలో యువతే అత్యంత పెద్ద బలం అని, యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ఉంటేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. భారతదేశ యువత రేపటి దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, దేశ రక్షణకు నిలిచే శక్తి కూడా అని, దేశానికి వ్యతిరేకంగా పనిచేసే శక్తులను ఎదుర్కొనే సత్తా యువతలో ఉండాలని తెలిపారు. అలాంటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటే వ్యక్తిగత జీవితంతో పాటు దేశ భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని, ఆరోగ్యాన్ని, కుటుంబ ఆశలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం మరియు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత బాధ్యత గురించి అవగాహన కల్పించడం జరిగింది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి - ఆరోగ్యకరమైన జీవితాన్ని నిర్మించుకోవాలి - డ్రగ్స్ రహిత భారతదేశం కోసం ప్రతి యువకుడు ఉద్యమించాలి అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన భాగ్యరధి డిగ్రీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, అధ్యాపక బృందం మరియు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరికీ నిర్వాహకుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 14-11-2026

సినిమా న్యూస్



తారక్-త్రివిక్రమ్ కాంబో ఫిక్స్!

యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో ఓ భారీ చిత్రం రాబోతున్నట్లు గత కొద్దికాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై నిర్మాత నాగవంశీ గతంలోనే స్పందించి పుకార్లకు చెక్ పెట్టారు. వీరిద్దరి కాంబోలో కచ్చితంగా ఓ సినిమా రాబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోవడంతో ఈ మూవీ ఆగిపోయిందనే ప్రచారం జోరుగా జరిగింది. ఈ నేపథ్యంలో, తాజాగా జరుగుతున్న ఊహాగానాలకు మేకర్స్ ముగింపు పలికారు. ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్, చినబాబు, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఉన్న ఒక ఫోటోను ఎన్టీఆర్ ఆర్ట్స్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ చిత్రం ఆగిపోయిందనే పుకార్లకు దీనితో గట్టి చెక్ పడింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఇంకా పట్టాల మీదనే ఉందని ఈ ఫోటో అభిమానులకు భరోసానిచ్చింది.

ఇక ఇదే ఫోటోను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ షేర్ చేయడంతో, ఈ రెండు సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నట్లు కన్ఫర్మ్ అయింది. కళ్యాణ్ రామ్‌తో పాటు ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 'అరవింద సమేత వీర రాఘవ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఎన్టీఆర్, త్రివిక్రమ్ మళ్లీ జతకట్టడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కార్తికేయ స్వామి నేపథ్యంలో సాగే ఒక భారీ పౌరాణిక వినోదాత్మక చిత్రంగా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి తోడు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నట్లు టాక్. ఇక ఈ సినిమాకు 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు పెట్టనున్నట్లు సమాచారం. ఏదైమైనప్పటికీ మేకర్స్ ఒక్క ఫోటోతో పుకార్లకు చెక్ పెట్టడంతో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.

పుకార్లకు చెక్ పాటపై కిరణ్ ఓపెన్!

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తూ, తొలిసారిగా మెగాఫోన్ పట్టి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'రియాలిటీ'. విభిన్నమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటూ మంచి రెస్పాన్స్ రాబట్టాయి. ఈనేపథ్యంలో, తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక వార్త జోరుగా వైరల్ అవుతూ అందరిలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'రియాలిటీ' సినిమాలో 'రఘుకుల తిలక' అనే శక్తివంతమైన ఆధ్యాత్మిక పాట ఉండబోతోందనే ప్రచారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వార్తలపై స్పందించిన హీరో కిరణ్ అబ్బవరం ఆ పుకార్లను నిజమేనని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ పాట వెనుక ఉన్న అసలు కారణాన్ని వివరిస్తూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాలో 'రఘుకుల తిలక' పాటను పెట్టాలనేది పూర్తిగా నా వ్యక్తిగత ఎంపికే అని కిరణ్ స్పష్టం చేశారు.

సినిమా చూసే ప్రేక్షకులకు ఈ ఆధ్యాత్మిక గీతం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. తాను ఆంజనేయ స్వామికి పరమ భక్తుడనని, ఆయనపై తనకు ఉండే అంతులేని భక్తి కారణంగానే తన తొలి దర్శకత్వ ప్రయత్నమైన ఈ చిత్రంలో తనకు ఎంతో ఇష్టమైన ఈ పాట ఉండాలని బలంగా కోరుకున్నట్లు కిరణ్ తెలిపారు. 'రఘుకుల తిలక' పాటను తాను నిత్యం వింటుంటానని, తన మనసులో ఆ పాటకు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ పాటకు మరింత జీవం, ప్రత్యేకత తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఒరిజినల్ కంపోజర్లు, గాయకులతోనే ఈ పాటను మళ్లీ పాడించినట్లు ఆయన పేర్కొన్నారు. తమ ఎమోషన్స్‌తో కూడిన ఈ పాటను ప్రేక్షకులు కూడా గుండెలకు హత్తుకుని గొప్పగా ఆదరిస్తారని తాను నమ్ముతున్నట్లు కిరణ్ అబ్బవరం చెప్పుకొచ్చారు.



కల కాదు నిజమైన పీడకల!

టాలీవుడ్ నిర్మాత రానా దగ్గుబాటి ఒక విభిన్నమైన హారర్ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. 'స్కేరీ పిక్చర్' అనే ఆసక్తికర టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ రవిబాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఓ ఈవెంట్ ద్వారా ఈ ప్రాజెక్ట్ గురించి రానా అధికారికంగా ప్రకటించినప్పటి నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో, తాజాగా రానా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. దశాబ్దాలుగా భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్, కమర్షియల్ సినిమాలకు పెట్టింది పేరైన ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సీనియర్ నిర్మాత డి. సురేష్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఆ సంస్థ నుంచి వస్తున్న అత్యంత విభిన్నమైన హారర్ చిత్రం ఇదే కావడం గమనార్హం. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ.. 'హారర్ జానర్‌ను ఇష్టపడే దర్శకులకు నిరంతరం ప్రొడక్షన్ సపోర్ట్, రిలీజ్ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 'స్కేరీ పిక్చర్'తో ఈ కొత్త ప్రయాణం మొదలుపెట్టాం. మన దేశంలో ప్రాంతాన్ని బట్టి భయాలు, కథలు మారుతుంటాయి. సైకలాజికల్, క్రీచర్, హారర్-కామెడీ, సోషల్ హారర్ ఇలా ఏ కొత్త కాన్సెప్ట్‌తో ఫిల్మ్ మేకర్స్ వచ్చినా మేము ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నాం. త్వరలోనే ఒక కొత్త పీడకల మొదలుకాబోతోంది.. ఒక కొత్త భయంకరమైన కల నిజం కాబోతోంది" అని పేర్కొన్నారు. డాక్టర్ డి. రామానాయుడు సమర్పణలో, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ సినిమాను 2027లో విడుదల చేయబోతున్నట్లు రానా తెలిపారు. ఇక అనసూయ, అవును ఫేమ్ రవిబాబు ఈ చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుండటం విశేషం.



భర్త కోసం సావిత్రి సమరం!

జాతీయ అవార్డు గ్రహీత, కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా సస్పెన్స్ థ్రిల్లర్ 'సత్యవాన్ సావిత్రి'. ఈ చిత్రంలో దర్శకుడు కమ్ నటుడు మిస్కిన్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసి ప్రేక్షకుల్లో అంచనాలను విపరీతంగా పెంచేశారు. ఈ ట్రైలర్‌లో కీర్తి సురేష్ 'సావిత్రి' అనే పాత్రలో కనిపించారు. పెళ్లిపై ఎలాంటి ఆసక్తి లేని సావిత్రిని ఆమె తల్లిదండ్రులు బలవంతంగా వివాహం జరిపిస్తారు. అయితే ఆమె భర్త మాత్రం ఇద్దరి మధ్య ఒక గౌరవప్రదమైన దూరం పాటిస్తుంటాడు.

కాలక్రమేణా భర్తపై సావిత్రికి ప్రేమ కలగడం, ఇద్దరూ దగ్గరవ్వడం జరుగుతుంది. కానీ కథలో అసలైన మలుపు అక్కడే మొదలవుతుంది. తన భర్తకు ఎలాంటి సంబంధం లేని ఒక పెద్ద సమస్యలో అతను ఇరుక్కుంటాడు. తన భర్తను కాపాడుకోవడం కోసం సావిత్రి తన సీనియర్‌ను సైతం ఎదిరించాల్సి వస్తుంది. పవర్ ఫుల్ లాయర్‌గా నటించిన కీర్తి సురేష్ భర్తను ఎలా కాపాడుకుందనే సీన్లతో ట్రైలర్ ఉత్కంఠభరితంగా సాగింది. ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. కాగా.. ఈ చిత్రంలో చారుకేశ్, బాల శరవణన్, శిల్పా మంజునాథ్, దీపా శంకర్, మధుసూదన్, ఆర్. సుందరరాజన్, మాలా పార్వతి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రవీణ్ ఎస్. విజయ్ రచన, దర్శకత్వం వహిస్తుండగా, వేదిక్కరన్‌పట్టి ఎస్. శక్తివేల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం, నేపథ్య సంగీతం అందిస్తున్నారు.



మనిషి మళ్లీ పశువైతే

బిగ్‌బాస్ తెలుగు సీజన్10తో బుల్లితెర ప్రేక్షకుల్లో విపరీతమైన పాపులారిటీ సంపాదించుకున్న టాలీవుడ్ యంగ్ హీరో త్రిగుణ్, ప్రస్తుతం హౌస్‌లో తన ఆటతీరుతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తనదైన శైలిలో గేమ్‌ను మలుపు తిప్పుతూ 'గేమ్ చేంజర్' అనే ముద్రతో దూసుకుపోతున్నారు. కొంతమంది ఆయన ఆటను విమర్శిస్తున్నప్పటికీ, మరోవైపు అభిమానులు మాత్రం ఆయనకు భారీగా సపోర్ట్ చేస్తున్నారు. ఇలా హౌస్‌లో బిజీగా ఉన్న త్రిగుణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'జంగా'కు సంబంధించిన క్రేజీ అప్‌డేట్ తాజాగా బయటకు వచ్చింది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'కొన్ని లక్షల ఏండ్లు పట్టింది పశువు మనిషి అవ్వడానికి... మళ్ళీ పశువు అవుతానంటే నేను ఒప్పుకోను' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ఈ గ్లింప్స్ అత్యంత ఆసక్తికరంగా మొదలవుతుంది.

ఇందులో త్రిగుణ్ సైకిల్‌పై వెళ్తూ మందు తాగుతున్న మాస్ ఎంట్రీ అదుర్స్ అనిపించేలా ఉంది. 'మనుషులు పశువైతే మరణం వధమతాది' అంటూ సాగే నేపథ్యం సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ లేడీ రోల్‌లో వరలక్ష్మీ శరత్ కుమార్ నటిస్తుండగా, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. కేవిన్ గడ్డం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నేహా పఠాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్కే ఫిల్మ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్మ కిలారి, జయ చంద్ర నాయుడు కిలారి ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. బిగ్‌బాస్ షోతో క్రేజ్ తెచ్చుకున్న త్రిగుణ్ నుంచి వస్తున్న ఈ మాస్ యాక్షన్ మూవీపై టాలీవుడ్‌లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

